

హారతి పడితే రూ.వెయ్యి



- ఓటర్లకు నేరుగా నాని తాయిలాలు
- పత్తాలేని ఎన్నికల అబ్జర్వర్ టీమ్

గుడివాడ : గుడివాడ పట్టణం 20వ వార్డులో ఇంటింటి ప్రచారానికి వెళుతున్న వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కొడాలి నాని హారతి పట్టేవారికి బహిరంగంగానే రూ.1000 పళ్లెంలో వేస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేలా హారతి పళ్లెం డబ్బులు పంపిణీ యథేచ్ఛగా జరుగుతోంది. ఈ నెల 2వ తేదీన ఇదే తరహాలో హారతి పట్టిన వారికి పళ్లెంలో నాని నగదు వేసిన విషయాన్ని టీడీపీ నాయకులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై జిల్లా ఎన్నికల అధికారులు స్పందించలేదు. నాని ప్రచారంలో ఓటర్లను ప్రలోభపెడుతున్నారని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము బహిరంగంగా ఆరోపిస్తున్నా ఎన్నికల అధికారుల్లో చలనం లేదు

ఘనంగా రంజాన్

కులమతాలకు అతీతంగా రంజాన్ పండుగ జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగింది. మసీదుల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పిల్లలు, పెద్దలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బందరులో కూటమి ఎంపీ అభ్యర్థి బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి కొల్లు రవీంద్ర ప్రార్థనల్లో పాల్గొన్నారు.


చల్లపల్లిలో


చల్లపల్లి ఈద్గాలో సందేశమిస్తున్న ఖురాన్ గురువు


ములకలమ్మ చెరువులో ఏర్పడిన గుంతలు

ములకలమ్మ చెరువును మళ్లీ మింగేస్తున్నారు. నెల రోజులుగా అక్రమంగా మట్టి తవ్వకాలు సాగిస్తూ ఇటుక బట్టీలకు అమ్ముకుంటున్నారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, అధికారుల అండ ఉండటంతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చినా కొద్దిరోజులు ఆపి మళ్లీ రాత్రిపూట తవ్వకాలు చేపడుతున్నారు. టీడీపీ నాయకులు.. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు.

- రాత్రివేళ గుట్టుచప్పుడు కాకుండా మట్టి తవ్వకాలు
- అధికారులు, అధికార పార్టీ అండతోనే..
- నెల రోజులుగా ఇటుక బట్టీలకు తరలింపు

ములకలమ్మలో మళ్లీ తవ్వకాలు

గన్నవరం, ఏప్రిల్ 11 : గన్నవరం మండలం వీరపనేనిగూడెం ములకలమ్మ చెరువులో వైసీపీ నాయకుల అక్రమ తవ్వకాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటుక బట్టీల ప్రయోజనార్థం జేసీబీలను పెట్టి రోజూ రాత్రివేళ సుమారు 300కు పైగా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవట్లేదు. గ్రామ ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ తంతు జరుగుతోంది. రాత్రయితే చాలు.. వందలాది ట్రాక్టర్లకు మట్టిని లోడ్ చేస్తున్నారు. ఇటుక బట్టీల నిర్వాహకులు తమ పొలాలు మెరక చేసుకుంటున్నామని చెబుతూ.. మట్టి తోలి, అక్కడి నుంచి ఇటుక బట్టీలకు తరలిస్తూ భవిష్యత్తు అవసరాలకు దాచిపెడుతున్నారు.

చీకటిపడితే చాలు..

గ్రామంలో వైసీపీకి చెందిన జేసీబీలు ఉండటంతో చీకటి పడితే చాలు.. ఎక్కడపడితే అక్కడ ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. దీనిపై స్థానికులు అధికారులకు సమాచారం ఇస్తున్నా పట్టించుకోవడట్లేదు. తవ్వకాలు లేనప్పుడు వచ్చి, పరిశీలించి, మామూళ్లు అందుకుని వెళ్లిపోతున్నారు. తవ్వకాలను అడ్డుకోవాలంటూ ఇరిగేషన్ అధికారులు.. తహసీల్దారు, పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలిచ్చి చేతులు దులుపుకొన్నారు. రెవెన్యూ అధికారులేమో ఎన్నికల హడావిడి అంటూ పక్కకు తప్పుకొన్నారు. అయితే, ఎవరికి అందాల్సిన వాటాలు వారికి అందుతున్నాయని తెలుస్తోంది. వైసీపీ గన్నవరం అభ్యర్థి వల్లభనేని వంశీని అడ్డుపెట్టుకుని ఈ తవ్వకాలు జరుపుతున్నారు.

దాడులకు వెళ్లినప్పుడు వైసీపీ జేసీబీలైతే వదిలేయడం, వేరే వారివైతే కేసులు పెట్టడం చేస్తున్నారు. ఇటుక బట్టీల కోసం తవ్వకాలపై ఇప్పటికే పలుమార్లు గ్రామంలో వైసీపీ నాయకులు, తవ్వకందారుల మధ్య పంచాయితీలు జరిగాయి. అప్పట్లో ఇటుక బట్టీలకు మట్టి తరలించకుండా ఆపారు. అప్పట్లో గ్రామాభివృద్ధి కోసం సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీ, పీఏసీఎస్ అధ్యక్షుడి సమక్షంలో డబ్బు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ.5 లక్షల వరకూ వైసీపీకి చెందిన ఉప సర్పంచ్ బండి నాగసాంబిరెడ్డి తీసుకున్నాడని, ఇప్పటివరకు గ్రామాభివృద్ధికి ఉపయోగించలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ చేపడుతున్న అక్రమ తవ్వకాలు ఆపాలని గ్రామస్థులు, రైతులు కోరుతున్నారు.


రెండేళ్ల క్రితం నిర్మించిన కంపోస్టు యార్డు



- టీడీపీ హయాంలో రోడ్డు విస్తరణను అడ్డుకోలేదని పగబట్టిన ఎమ్మెల్యే
- ఆర్యవైశ్య కల్యాణమండపాన్ని అభివృద్ధి కానీయకుండా కుట్ర
- దానిపక్కనే కంపోస్టు సేకరణ పాయింట్ ఏర్పాటు
- వైసీపీ ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొత్తుకున్నా కంపోస్టు పాయింట్ తొలగించని వైనం
- ఎన్నికలొచ్చేసరికి ఓట్ల కోసం గోడకట్టి మూసివేత



ఇన్నాళ్లూ ఆర్యవైశ్యులపై కక్షగట్టి, ఆర్యవైశ్య కల్యాణమండపం అభివృద్ధిని అడ్డుకొని, వారిని అష్టకష్టాలు పెట్టిన స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల వేళ ఓట్ల రాజకీయం చేస్తున్నారు. టీడీపీ హయాంలో రహదారి విస్తరణ పనుల్లో తాను చెప్పినట్టు వినలేదని ఐదేళ్లపాటు ఆర్యవైశ్యులను ముప్పుతిప్పలు పెట్టి ఎన్నికల వేళ ఆర్యవైశ్య కల్యాణమండపం అభివృద్ధికి సహకరిస్తున్నట్టు కవరింగ్ ఇస్తున్నారు. దీనిపై ఆర్యవైశ్యులు తిట్టిపోస్తున్నారు.

నాడు కక్షగట్టి.. నేడు కవరింగ్!

ఎన్నికల వేళ ఆర్యవైశ్యులపై కొడాలి నాని కపట ప్రేమ

గుడివాడ : టీడీపీ హయాంలో స్థానిక బంటుమిల్లి రోడ్డు విస్తరణకు ఎమ్మెల్యే కొడాలి నాని, వైసీపీ నాయకులు అడ్డుపడిన విషయం విదితమే. పలుమార్లు రహదారి వెంబడి ఉన్న దుకాణదారులు, ఆర్యవైశ్య ప్రముఖులతో ఎమ్మెల్యే నాని భేటీలు ఏర్పాటు చేసి భూసేకరణకు సహకరించవద్దని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో విస్తరణను నిలుపుదల చేయాలని విశ్వప్రయత్నాలు చేశారు. దీంతో వ్యూహం బెడిసికొట్టింది. కానీ అభివృద్ధికి సహకరించాలని, ట్రాఫిక్ అంతరాయానికి స్వస్తి పలకాలనే సదుద్దేశంతో దుకాణదారులు, ఆర్యవైశ్య ప్రముఖులు స్వచ్ఛందంగా విస్తరణకు సహకరించారు. చెత్త రోడ్డుపైకి వచ్చి వాహనదారులు ఇబ్బందులు పడ్డా పట్టించుకోలేదు. 2019లో ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే నాని నిజస్వరూపం బట్టబయలైంది. ఆర్యవైశ్యులపై కక్ష సాధింపునకు ప్లాన్ చేశారు. దీంతో స్థానిక మెయిన్ రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణమండపం పక్కనే ఉన్న తుమ్మల రాంబ్రహ్మం పార్కు దక్షిణంవైపున కల్యాణమండపానికి గోడకు ఆనుకుని కంపోస్టు సేకరణ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో చక్రం తిప్పిన... నాని ముఖ్య అనుచరుడు శశి, మున్సిపల్ అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి అవసరం లేకున్నా నిర్మాణం చేపట్టారు. దూరంగా ఉన్న రైతుబజారు, పండ్ల మార్కెట్ నుంచి చెత్తను కంపోస్టు సేకరణ పాయింట్‌కు తరలించేలా పన్నాగం పన్నారు. దీంతో చెత్త కంపుతో ఆర్యవైశ్య కల్యాణ మండపానికి గిరాకీ రాకుండా అడ్డుకోవాలని పన్నాగం వేశారు. ఆర్యవైశ్యులను చెప్పుచేతల్లో పెట్టుకోవాలని ప్రయత్నించారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఆర్యవైశ్యులు తలొగ్గలేదు. పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు పార్టీలకతీతంగా పలుమార్లు ఎమ్మెల్యే నాని, మున్సిపల్ కమిషనర్‌లను కలిసినా కంపోస్టు సేకరణ పాయింట్ నిర్మాణాన్ని నిలుపుదల చేయలేదు.

హుటాహుటిన గోడ కట్టేశారు

ఎన్నికల వేళ ఓట్ల కోసం నాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా పలు సామాజికవర్గాల్లో వ్యతిరేకతను ఎదుర్కొంటున్న స్థానిక ఎమ్మెల్యే వారిని ప్రసన్నం చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో నిన్నటిదాకా చెప్పులు అరిగేలా తిరిగినా ఫలితం లేకుండా పోయింది. నేడు పట్టణంలోని ఆర్యవైశ్యుల ఓట్లు కోసం కంపోస్టు సేకరణ పాయింట్‌కు గోడ కట్టి మూసివేశారు. నిన్నటిదాకా చెత్తతో ఉన్న ప్రాంతంలో గోడ కట్టి ఉండటాన్ని చూసి పట్టణ ప్రజలు నివ్వెరపోయారు. ఎన్నికల వేళ అవసరమున్నా, లేకున్నా ఏ పనైనా క్షణాల్లో చేస్తారనే దానికి నిదర్శనంగా కంపోస్టు సేకరణ పాయింట్ నిలుస్తుంది.

ఎన్నికల వేళ ఆర్యవైశ్యులపై కపట ప్రేమ

ఎన్నికల వేళ ఎమ్మెల్యే కొడాలి నాని ఎనలేని ప్రేమ నటిస్తున్నారు. పలుమార్లు మొత్తుకున్నా చెత్త సేకరణ పాయింట్‌ను తీసేందుకు ఒప్పుకోని నాని నేడు దానిని మూసివేయడం విడ్డూరంగా ఉంది. ప్రచారంలో నానిని ఆర్యవైశ్యులు నిలదీస్తుండటంతో తప్పక చెత్త సేకరణ పాయింట్‌ను మూసివేశారు.

– గోకవరపు సునీల్,
టీడీపీ వాణిజ్యవిభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

మచిలీపట్నం తాలూకా ఎస్‌ఐ వీఆర్‌లోకి

మచిలీపట్నం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ చాణక్యను వీఆర్‌లోకి పంపుతూ ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అంశంపై అధికారిక ప్రకటన విడుదల చేయకున్నా ఎస్‌ఐ చాణక్యను వీఆర్‌లోకి పంపారని పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఈనెల 7వ తేదీన బందరు మండలం ఉల్లిపాలెంలో జరిగిన నూకాలమ్మ జాతరలో వైసీపీ కార్యకర్తలు, టీడీపీ కార్యకర్తలపై దాడికి దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు విచారణ చేసి వైసీపీ, టీడీపీ కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. టీడీపీ కార్యకర్తల ఎదుటే వైసీపీ కార్యకర్తలను ఎస్‌ఐ కొట్టాడనే కారణంతో ఎమ్మెల్యే పేర్ని నాని, ఆయన కుమారుడు మచిలీపట్నం నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి పేర్ని కిట్టు తాలూకా పోలీస్‌స్టేషన్ వద్దకు కార్యకర్తలతో కలిసి వెళ్లి ఆందోళన చేశారు. సీసీ కెమెరాను, ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. ఈ ఘటనలో వైసీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్లు, మరో వైసీపీ నాయకుడిపై చిలకలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. తాలూకా పోలీస్‌స్టేషన్‌లో జరిగిన ఘటనపై మచిలీపట్నం డీఎస్పీ విచారణ చేసి నివేదికను ఎస్పీకి అందజేశారు. ఈ నేపథ్యంలో తాలూకా ఎస్‌ఐను వీఆర్‌కు పంపుతూ నిర్ణయం తీసుకున్నారు. వైసీపీ నాయకుల ఒత్తిడితోనే ఎస్‌ఐను వీఆర్‌కు పంపారని పోలీస్ వర్గాలు చెప్పుకుంటున్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు..

» అడ్డుకున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు

- 6లో..

వేదవ్యాస్ మాతోనే..

» రెండ్రోజుల్లో చంద్రబాబు, పవన్‌ను కలుస్తా
» సమస్య పరిష్కరిస్తా : బాలశౌరి

- 6లో..



నేటి నుంచి విజయవాడలో ఉష్ణోగ్రతలు ఇలా.. (వాతావరణ శాఖ అంచనా)

తేదీ	ఉష్ణోగ్రత
12	39.88
13	39.07
14	40.31
15	41.91
16	41.05
17	40.76



చిన్న బ్రేక్

- కాస్త తగ్గిన ఉష్ణోగ్రతలు
- నేడు, రేపు కొంచెం తక్కువగానే..
- ఎల్లుండి నుంచి మళ్లీ పెరుగుదల
- ఉత్తర ఈశాన్యంలో సైక్లోనిక్ సర్క్యూల్

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : వాతావరణంలో భిన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు హెచ్చుతగ్గుల మధ్య సాగుతున్నాయి. నగరంలో గురువారం ఈ పరిస్థితి స్పష్టంగా కనిపించింది. ఇప్పటి వరకు ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు భానుడి భగభగలాడేవాడు. ఉక్కపోతలతో జనం అల్లాడిపోయేవారు. గురువారం మాత్రం కొద్దిసేపు ఎండ, కొద్దిసేపు దట్టమైన మబ్బులు కనిపించాయి. ఉత్తర ఈశాన్య రాష్ట్రాల్లో ఏర్పడిన సైక్లోనిక్ సర్క్యూల్ కారణంగా ఈ మార్పులు వచ్చాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల వాతావరణంలో చల్లదనం ఏర్పడిందంటున్నారు. ఇప్పటి వరకు 40 డిగ్రీల వద్ద నమోదవుతున్న ఉష్ణోగ్రతలు రెండు, మూడు రోజుల పాటు 38-39 డిగ్రీలకు తగ్గుతాయని వాతావరణ శాఖ ఫోర్‌కాస్ట్ విడుదల చేసింది. ప్రస్తుతం నమోదవుతున్న ఉష్ణోగ్రతలకు ఒకటి నుంచి రెండు డిగ్రీల వరకు తగ్గే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

రెండు రోజులు తగ్గుదల

విజయవాడలో గురువారం 40.75 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శుక్ర, శనివారాల్లో ఒక డిగ్రీ మేరకు తగ్గుతుంది. శుక్రవారం 39.78 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావచ్చని వాతావరణ శాఖ అంచనా. శనివారం 39.24 డిగ్రీలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ రెండు రోజులు మాత్రమే భానుడు కాస్తంత ఉపశమనం కలిగించనున్నాడు. ఇక ఆదివారం నుంచి పరిస్థితి మామూలుగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. నగరంలో ఆదివారం 40.31 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావచ్చని ఆ శాఖ ఫోర్‌కాస్ట్ విడుదల చేసింది. ఇక ఆ తర్వాత నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు 41 నుంచి 42 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.



బూరగడ్డ వేదవ్యాస్‌ను పరామర్శిస్తున్న మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి, ఎంపీ బాలశౌరి

వేదవ్యాస్ మాతోనే.. మరో ఆలోచన లేదు

- రెండ్రోజుల్లో చంద్రబాబు, పవన్‌ను కలుస్తా
- సమస్య పరిష్కరిస్తా : బాలశౌరి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 : మాజీ ఉపసభాపతి బూరగడ్డ వేదవ్యాస్ కూటమితోనే ఉంటారని ఎంపీ, ఉమ్మడి పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. గురువారం ఉదయం భాస్కరపురంలోని వేదవ్యాస్ ఇంటికి బాలశౌరి వెళ్లారు. వేదవ్యాస్‌తో భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. అనంతరం బాలశౌరి మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా చాలాకాలంగా బూరగడ్డ వేదవ్యాస్, ఆయన తండ్రి బూరగడ్డ నిరంజనరావులు 1967 నుంచి పెడన, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలకు సేవలందిస్తున్నారన్నారు. కొన్ని కారణాల వల్ల పెడన అసెంబ్లీ సీటు టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌కు ఇచ్చినప్పటికీ వేదవ్యాస్‌కు సముచిత న్యాయం కల్పిస్తామన్నారు. దీనికోసం చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లతో చర్చిస్తామన్నారు. రెండురోజుల్లో వ్యాస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. వేదవ్యాస్ మాట్లాడుతూ, తనకు అనారోగ్యంగా ఉన్నందున బాలశౌరి పరామర్శకు వచ్చారని.. రాజకీయంగా ఉన్న సమస్యలపై చర్చించామన్నారు. బాలశౌరి తెనాలి ఎంపీగా ఉన్నప్పటి నుంచి తనకు పరిచయం ఉందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీలో చేరను..

- ఎమ్మెల్యే సీటు వస్తుందని ఆశించా
- బాలశౌరి హామీ మేరకే తుది నిర్ణయం

- బూరగడ్డ వేదవ్యాస్ వెల్లడి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 : సీటు రానందున కొందరు నాయకులు తాను వైసీపీలో చేరుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని.. తాను వైసీపీలో చేరే ప్రసక్తే లేదని మాజీ ఉపసభాపతి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెడన అసెంబ్లీ నియోజకవర్గం సీటును ఆశించానని, అది దక్కకపోవడంతో మానసికంగా అనారోగ్యానికి గురవడం వల్ల చాలా రోజుల తరువాత మీడియాతో మాట్లాడుతున్నానన్నారు. పెడన, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గాలతో తనకు సత్సంబంధాలున్నాయన్నారు. సీటు కోసం చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్‌ను కలిశానని, అయినప్పటికీ కొన్ని కారణాల వల్ల తనకు సీటు ఇవ్వలేదన్నారు. రెండు రోజుల్లో చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను కలిసి తనకు సముచిత స్థానం కల్పిస్తానని బాలశౌరి వాగ్దానం చేశారని, ఆయన వాగ్దానాన్ని అనుసరించి ఏ నిర్ణయం తీసుకోవడం లేదన్నారు. నియోజకవర్గ నేతలు, ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని మరచిపోలేనన్నారు.

ప్రజాస్వామ్యం మంటగలిపారు

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ
- బ్రహ్మయ్యలింగం చెరువును రిజర్వాయర్ చేస్తా : యార్లగడ్డ వెంకట్రావు
- వైసీపీ పాలనలో సంపద సృష్టి లేదు.. ఇసుక దోపిడీనే : బాలశౌరి
- గన్నవరంలో టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి సమావేశం



గన్నవరంలో కూటమి పార్టీల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ

గన్నవరం, ఏప్రిల్ 11 : రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మంటగలిసిందని, అరాచకం పెరిగిపోయి ఒక నియంతృత్వ పాలన కొనసాగుతున్నదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ అన్నారు. కక్ష సాధింపుతో గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేసి కార్లను దహనం చేసి, పలువురిని గాయపరిస్తే.. వారిపైనే ఎదురు కేసులు పెట్టి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపిన విషయం అందరికీ తెలిసిందే అన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తమ అధినేత చంద్రబాబు నాయుడుని కూడా అరెస్టు చేసి జైలుకు పంపింది దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వమే అన్నారు. గన్నవరం ఏబీ కన్వెన్షన్‌లో టీడీపీ-బీజేపీ-జనసేన పార్టీల ఉమ్మడి సమావేశం గురువారం రాత్రి జరిగింది. తొలుత జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ, చంద్రబాబు అరెస్టును ఖండించి దుర్మార్గపు వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు టీడీపీతో కలుస్తున్నానని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారన్నారు. గన్నవరం నియోజకవర్గానికి, మచిలీపట్నం పార్లమెంటుకు సమర్థులైన అభ్యర్థులున్నారని, వారిని మంచి మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గన్నవరం నియోజకవర్గాన్ని రాష్ట్రంలో నెంబర్ వన్ స్థానంలో నిలుపుతానన్నారు. ఎంఎస్‌సీ కంపెనీ తీసుకువస్తానని చెప్పారు. ఓడిపోతే అమెరికా వెళ్లిపోతానని దుష్ప్రచారం చేశారని, తాను ఎక్కడికి వెళ్లేది లేదని, తన ఫొటోను 32 మంది తమ గుండెలపై పచ్చబొట్లు పొడిపించుకున్నారని, వారితో పాటు ఎంతోమంది అభిమానుల కోసం గన్నవరంలో పోటీ చేస్తానని ఆనాడే స్పష్టం చేశానన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అవమానాలు మోస్తే.. టీడీపీలో భావోద్వేగాలు మోయాల్సి వస్తున్నదన్నారు. ఏ మూలకు వెళ్లినా గన్నవరం సీటు గెలవాలని పదేపదే చెబుతున్నారని అన్నారు. బ్రహ్మయ్యలింగం చెరువును రిజర్వాయర్ చేసి.. 12వేల ఎకరాలకు సాగునీరు అందిస్తానని, పోలవరం కుడికాలువ నీటిని ఏలూరు కాలువకు అనుసంధానం చేసి తీరుతానని స్పష్టం చేశారు.

మచిలీపట్నం పార్లమెంట్ జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ, ఐదేళ్లు ఎంపీగా అభివృద్ధి చేసి చూపించానన్నారు. వైసీపీ ముఖ్య నాయకులు పవన్ కళ్యాణ్, చంద్రబాబును తిట్టమని చెప్పారని, తాను అలాంటి వ్యక్తిని కాదని అభివృద్ధి పరంగా తనను ఉపయోగించుకోవాలని సూచించానని తెలిపారు. బందరు పోర్టుకు రూ.4వేల కోట్లు తీసుకువచ్చానని, ఈ నగదును వైసీపీ ప్రభుత్వం ఎక్కడ వాడుకుంటుందోనని ప్రత్యేక ఖాతాను తెరిచి పక్కదారి వెళ్లకుండా ఉండేలా నిబంధనలు పెట్టడం జరిగిందన్నారు. బందరులో మెడికల్ కళాశాల ఏర్పాటుకు కృషి చేశానన్నారు. హనుమాన్ జంక్షన్‌లో రూ.కోటితో వంగవీటి మోహన రంగా కళ్యాణ మండపం పాటు మరో 15 కమ్యూనిటీ హాలు నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో సంపద సృష్టి లేదన్నారు. దోచుకోవటమే తప్ప మరొకటి లేని ముఖ్యమంత్రిని ఎన్నడు చూడలేదన్నారు. అరాచక శక్తుల పాలన పోవాలంటే కూటమి అభ్యర్థులు గెలవాలన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పార్టీల నేతలు పాల్గొన్నారు.



బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న వసంత

శుభకార్యంలా చేయాలి

- పార్టీ శ్రేణులకు వసంత దిశా నిర్దేశం

గొల్లపూడి, ఏప్రిల్ 11 : పార్టీ కార్యక్రమాలను ఇంట్లో శుభకార్యాలుగా భావించి విజయవంతం చేయాలని టీజేపీ, జనసేన బలపర్చిన మైలవరం టీడీపీ అభ్యర్థి వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. కొండపల్లి మున్సిపాలిటీ బూత్ కమిటీ సభ్యులతో ఆయన గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడుతూ, శంఖారావం, సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈనెల 14న మైలవరంలో నిర్వహించనున్న జయహో బీసీ, 16న ఎస్సీ సదస్సులను జయప్రదం చేయాలన్నారు. ఈనెల 22న నామినేషన్ దాఖలు చేయనున్నట్టు తెలిపారు. వచ్చే 6 రోజులు కొండపల్లి మున్సిపాలిటీలో విస్తృతంగా పర్యటించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో జంపాల సీతారామయ్య, చెన్నబోయిన చిట్టిబాబు, చనమోలు నారాయణ, చుట్టుకుదురు శ్రీనివాసరావు, ధరణికోట విజయలక్ష్మి, వాసు, సైదులు, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ ప్రజాదరణ కోల్పోయింది : రవీంద్ర



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 : వైసీపీ ప్రజాదరణ కోల్పోతున్నదని, అందుకు నిదర్శనమే పెద్ద ఎత్తున వైసీపీ కార్యకర్తలు టీడీపీ, జనసేనలో చేరుతున్నారని మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. గురువారం రాత్రి నిజాంపేట రంగాబొమ్మ సెంటర్ వద్ద 48, 50 డివిజన్లలో విన్నకోట శ్రీను, పడమట నాగరాజు ఆధ్వర్యంలో పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వారికి రవీంద్ర, బండి రామకృష్ణలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సైకో జగన్‌రెడ్డిని, అక్రమాల పేర్ని నానిని ప్రజలు వదిలించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, కరెడ్ల సుశీల, పల్లపాటి అభినవ్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనతో విసిగెత్తారు : కాగిత



కృత్తివెన్ను : వైసీపీ ప్రభుత్వం, జగన్ పాలనపై విసిగిపోయి, అసంతృప్తితో పలువురు నాయకులు గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పెడన నియోజకవర్గ పరిధిలోని గూడురు మండలం ముక్కొల్లు ఆర్బీకె చైర్మన్ సమ్మెట రాఘవ ప్రసాద్ ఆధ్వర్యంలో కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు సమ్మెట బాబు, తులసీరావులతో పాటు సుమారు 200 మంది వైసీపీ వీడి టీడీపీ, జనసేన పార్టీలో చేరారు. వారికి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ టీడీపీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కృత్తివెన్ను మండలం వాలంకలో సుమారు 50మంది యువత టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి తనయుడు అనుదీప్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

తోటివారిని ఆదుకోవటమే రంజాన్ అంతర్యం : నెట్టెం

జగ్గయ్యపేట, ఏప్రిల్ 11 : తోటివారిని ఆదుకోవటం, సహాయం అందించటం రంజాన్ పర్వదిన అంతర్యమని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు



నెట్టెం రఘురాం అన్నారు. రంజాన్ సందర్భంగా బలుసుపాడురోడ్‌లోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. నెలరోజులు ఉపవాస దీక్షల్లో పాల్గొన్న ముస్లింలు పేదలు, తోటివారికి దానం చేయటం మంచి సాంప్రదాయమన్నారు. ఆయనతో పాటు జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి అన్వర్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ సత్తార్, జనసేన నేత మోసిన్ తదితరులు ఉన్నారు.



కుచికాయిలపూడి గ్రామంలో గజమాలతో స్వాగతం

అభివృద్ధి మరిచిన నానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధం

- ఎన్నికల ప్రచారంలో వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు : అభివృద్ధి మరిచిన ఎమ్మెల్యేకి గుడివాడ ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని.. ఎన్నికల రోజు కోసం ఎదురు చూస్తున్నారని గుడివాడ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. గురువారం పోలిమెట్ల, కుచికాయిలపూడి గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన మరుసటి రోజు నుంచి గుడివాడ ప్రజలకు అభివృద్ధిని చేసి చూపుతానని వెనిగండ్ల అన్నారు. కుచికాయిలపూడిలో భారీ గజమాలతో కార్యకర్తలు రాముకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

1142 ఫిర్యాదుల పరిష్కారం

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు



వన్‌టౌన్, ఏప్రిల్ 11 : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 1142 ఫిర్యాదులను పరిష్కరించినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.దిల్లీరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో భాగంగా ఎన్‌జీఎస్‌పీ తదితర మార్గాల ద్వారా 1156 ఫిర్యాదులు రాగా 1142 పరిష్కరించినట్లు చెప్పారు. సీ-విజిల్‌లో తిరువూరు నియోజకవర్గంలో 55, విజయవాడ పశ్చిమలో 6, సెంట్రల్‌లో 58, తూర్పులో 73, మైలవరంలో 18, నందిగామలో 134, జగ్గయ్యపేటలో 103, ఇతర పోలింగ్ స్టేషన్‌ల పరిధి నుంచి 4 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. ప్రతికూల వార్తలకు సంబంధించి 60 అంశాలను పరిశీలించి 56 అంశాలలో చర్యలకు ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు రూ.6.74 కోట్ల విలువైన నగదు, మద్యం ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో రూ.1.13 కోట్ల సీజర్‌లు జరిగినట్లు మైలవరంలో రూ.35.62 లక్షలు నందిగామలో రూ.18.33లక్షలు, తిరువూరులో రూ.84.57 లక్షలు, విజయవాడ సెంట్రల్‌లో రూ.2.75 కోట్లు, విజయవాడ తూర్పులో రూ.64.12లక్షలు, విజయవాడ పశ్చిమలో రూ.82.44లక్షల మేరకు సీజర్‌లు జరిగినట్లు ఆయన వెల్లడించారు.

కోడ్ ఉల్లంఘించిన 11 మంది ఉద్యోగులపై వేటు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన 11 మంది ఉద్యోగులపై జిల్లా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడిన వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. వీరిలో కాంట్రాక్టు, రోజువారీ ఉద్యోగులే ఎక్కువగా ఉన్నారు. ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగులు, ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులు, రెన్యూమరేషన్ తీసుకునే ఉద్యోగులు ఏడుగురు చొప్పున మొత్తం 11 మంది కోడ్ ఉల్లంఘనలకు పాల్పడ్డారని, వీరిపై చర్యలు తీసుకున్నట్టుగా జిల్లా ఎన్నికల యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువచ్చింది. వీరు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడ్డారు? పేర్లను మాత్రం బహిర్గత పరచలేదు.



గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

ప్రశాంత ఎన్నికలకు పటిష్ట చర్యలు

- కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

గన్నవరం, ఏప్రిల్ 11 : ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. గన్నవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లను గురువారం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ గీతాంజలి శర్మతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా స్ట్రాంగ్ రూమ్‌లు ఏర్పాటు చేశారా లేదా అని పరిశీలించినట్టు తెలిపారు. చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిచేసి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దారు పవన్‌కుమార్, సీఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం స్వాధీనం



గుడివాడ : రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పోతురాజు సుదర్శనకుమార్ అదుపులోకి తీసుకుని 26 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు టూటౌన్ సీఐ ఎం.ఎన్ దుర్గారావు తెలిపారు. ఎస్సై పి.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎన్నికల సన్నాహం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన 'ఈవీఎం ర్యాండమైజేషన్' శుక్రవారం ప్రారంభం కానుంది. ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు, రిటర్నింగ్ అధికారులు, రాజకీయ పార్టీల నేతల సమక్షంలో ఈ ప్రక్రియను నిర్వహిస్తారు. ఈవీఎంలను అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కేటాయిస్తారు. ఈవీఎంలో బ్యాలెట్ యూనిట్ (బీయూ), కంట్రోల్ యూనిట్ (సీయూ)లు ఉంటాయి. ఒక్కో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్‌కు ప్రత్యేక కోడ్ ఉంటుంది. ఏ కోడ్ కలిగిన బ్యాలెట్ ఏ పోలింగ్ స్టేషన్‌కు వెళుతుందో ఎవరికీ తెలియకుండా చేసే పద్ధతినే 'ఈవీఎం ర్యాండమైజేషన్' అంటారు. ఇది కంప్యూటర్ ఆధారంగా రాజకీయ పార్టీల సమక్షంలో నిర్వహిస్తారు. ఈవీఎంల కోడ్స్‌ను పరిగణనలోకి తీసుకుని కంప్యూటర్ ప్రోగ్రామింగ్ ద్వారా ఒక్కో నియోజకవర్గానికి అవసరానికి తగినట్టుగా ఆటోమేటిక్‌గా ఈవీఎంలను కేటాయిస్తుంది. ఎలాంటి అభ్యంతరాలు లేవన్న తర్వాతనే ఎన్నికల గోడన్‌లో భౌతికంగా ఈ ప్రక్రియ చేపడతారు. డేటా ప్రాతిపదికన అత్యంత రహస్యంగా ఈవీఎంలను బాక్సుల్లో సర్దుతారు. బాక్సులో సర్దే ఈవీఎంలు ఏ పోలింగ్ స్టేషన్ పరిధిలోకి వెళతాయో కూడా అక్కడి సిబ్బందికి కూడా తెలియదు. అత్యంత రహస్యంగా, పారదర్శకంగా ఉండే ఈ పద్ధతిని శుక్రవారం గొల్లపూడి లోని జిల్లా ఈవీఎంల గోడౌన్‌లో నిర్వహిస్తారు. రాజకీయ పార్టీలతో సమావేశం ముగిసిన తర్వాత జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు గొల్లపూడి వచ్చి భౌతికంగా ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తారు.

- నేడు నియోజకవర్గాల వారీగా ఈవీఎంల ర్యాండమైజేషన్
- కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల సమక్షంలో కేటాయింపు
- కంప్యూటర్ ప్రోగ్రామ్ ద్వారా ప్రారంభం కానున్న ప్రక్రియ
- నియోజకవర్గాల వారీగా డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు తరలింపు



పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎం, వీవీప్యాట్లు

ఎన్టీఆర్ జిల్లా పరిధిలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం మొత్తం 1792 పోలింగ్ స్టేషన్లున్నాయి. ఈవీఎంలకు సంబంధించి బ్యాలెట్ యూనిట్లు (బీయూ) 2150 అవసరం కాగా ప్రస్తుతం గోడౌన్‌లో 2787 బ్యాలెట్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. కంట్రోల్ యూనిట్లు (సీయూ) 2150 అవసరం కాగా 2222 వరకు ఉన్నాయి. వీవీ పాట్లు 2330 అవసరం కాగా 2661 అందుబాటులో ఉన్నాయి.

- అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి తిరువూరు పరిధిలో 234 పోలింగ్ స్టేషన్ల నిర్వహణకు 281 బ్యాలెట్ యూనిట్లు (బీయూ), కంట్రోల్ యూనిట్లు (సీయూ) కావాల్సి ఉన్నాయి. విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో 253 పోలింగ్ స్టేషన్లకు గాను 304 బీయూ, సీయూలు కావాల్సి ఉన్నాయి. సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో 267 పోలింగ్ స్టేషన్లకు 320 బీయూ, సీయూలు, తూర్పు నియోజకవర్గంలో 298 పోలింగ్ స్టేషన్లకు 358 బీయూ, సీయూలు, మైలవరం నియోజకవర్గంలో 296 పోలింగ్ స్టేషన్లకు 355 బీయూ, సీయూలు, నందిగామ నియోజకవర్గంలో 222 పోలింగ్ స్టేషన్లకు 266 బీయూ, సీయూలు, జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 222 పోలింగ్ కేంద్రాలకు 266 బీయూ, సీయూలు అవసరం ఉంది.
- అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈవీఎంలకు సంబంధించి 2150 బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు అవసరం కాగా 2820 బీయూ, 2221 సీయూలు అందుబాటులో ఉన్నాయి. వీవీప్యాట్లు 2330 కావాల్సి ఉండగా 2702 అందుబాటులో ఉన్నాయి.
- పార్లమెంట్, అసెంబ్లీ మొత్తంగా 1792 పోలింగ్ స్టేషన్లకు 4300 బ్యాలెట్ యూనిట్లు అవసరం కాగా 5607 బీయూలు అందుబాటులో ఉన్నాయి. 4300 కంట్రోల్ యూనిట్లు అవసరం కాగా 4443 కంట్రోల్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 4660 వీవీప్యాట్లు అవసరం కాగా 5363 అందుబాటులో ఉన్నాయి.
- బ్యాలెట్ యూనిట్లు 130 శాతం అందుబాటులో ఉన్నాయి. కంట్రోల్ యూనిట్లు 123 శాతం అందుబాటులో ఉన్నాయి. వీవీప్యాట్లు 129 శాతం ఉన్నాయి.

డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు ఈవీఎంల తరలింపు

ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కేటాయించిన ఈవీఎంలను డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్ (డీసీ)కు తరలిస్తారు. ప్రతి రిసెప్షన్ సెంటర్లలో ఉండే స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను భద్రపరుస్తారు. తిరువూరులో బాలికల జెడ్పీ హైస్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి సంబంధించి గాంధీజీ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్, సెంట్రల్‌లో ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియం, తూర్పు నియోజకవర్గానికి సంబంధించి ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్, మైలవరానికి సంబంధించి లకిరెడ్డి బాలిరెడ్డి ఇండోర్ స్టేడియం, నందిగామ నియోజకవర్గానికి సంబంధించి కేవీఆర్ కాలేజీ, జగ్గయ్యపేట నియోజకవర్గానికి సంబంధించి జీవీజే బాలుర జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలోని స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు. ఇక్కడి నుంచి పోలింగ్ ముందు రోజున పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, వీవీప్యాట్లు, ఇతర స్టేషనరీని అందజేస్తారు.

ఉద్దేశపూరకంగానే గొడవలు

- ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు మణిదీప్



గుడివాడ, ఏప్రిల్ 11 : ఈ నెల 7వ తేదీన విజయవాడలో నిర్వహించిన అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం సమావేశంలో వైసీపీ నాయకులు వెలంపల్లి శ్రీనివాస్, కొండపల్లి బుజ్జిలు ఉద్దేశపూరకంగానే గొడవ చేశారని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు యక్కలి మణిదీప్ ఆరోపించారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య మహాసభ గుడివాడ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, సంఘ పిలుపు మేరకు విజయవాడ సెంట్రల్ కూటమి అభ్యర్థి బొండా ఉమా సభకు హాజరయ్యారని, పార్టీలకతీతంగా నిర్వహించిన సమావేశంలో మిగిలిన పార్టీలకు చెందిన నాయకులను ఆహ్వానించడం జరిగిందన్నారు. ఉద్దేశ్యపూర్వకంగానే దూండి రాకేశ్‌పై వైసీపీ కార్యకర్తలు దాడిచేశారని, దీనికి కారకుడైన కొండపల్లి బుజ్జిపై రాష్ట్ర మహాసభ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. హనుమాన్‌పేటలోని కార్యాలయాన్ని తిరిగి సంఘానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. గుడివాడ నడిబొడ్డులోని ఆర్యవైశ్య కళ్యాణమండపం పక్కన స్థానిక వైసీపీ నాయకులు ఉద్దేశ్యపూరకంగానే డంపింగ్ సేకరణ పాయింట్‌ను ఏర్పాటు చేశారని, ఎన్నికల సమయం కావడంతో ఆర్యవైశ్యులను మభ్యపెట్టేందుకు సదరు పాయింట్‌ను మూసివేసారని మణిదీప్ ఆరోపించారు.

ఇసుక అక్రమ తవ్వకాలు.. అడ్డుకున్న టీడీపీ, జనసైనికులు



ఇసుక అక్రమ రవాణాను అడ్డుకున్న టీడీపీ, జనసైనికులు

ఘంటసాల, ఏప్రిల్ 11 : ఘంటసాల మండల పరిధిలోని శ్రీకాకుళం కరకట్ట వద్ద డంపింగ్ యార్డు నుంచి జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను టీడీపీ నేత, శ్రీకాకుళం ఎంపీటీసీ తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), జనసైనికులు గురువారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా చిన్నా మాట్లాడుతూ, గత రెండు వారాలుగా శ్రీకాకుళం డంపింగ్ యార్డులో యంత్రాల సహాయంతో టిప్పర్లతో ఇసుక లోడింగ్ జరుగుతోందని తెలిపారు. రెవెన్యూ, పోలీసు శాఖలను అనుమతి పత్రాలు చూపాలని కోరగా, అధికారులు జగనన్న లే అవుట్లకు పర్మిషన్ ఉందని చెబుతున్నారని ఆరోపించారు. జగనన్న లే అవుట్లకు వెళ్తుంటే ఈ ఇసుక లారీల దగ్గర నుంచి ఒక టన్నుకి రూ.650 రూపాయల చొప్పున ఎందుకు వసూళ్లు చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే జిల్లాస్థాయి అధికారులు స్పందించి ఇసుక డంపింగ్ యార్డు నుంచి అక్రమంగా ఇసుక బయటికి తరలించకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో కొల్లా రుచిత్, మాదాసు వినయ్, సుగ్గున పవన్ కుమార్, కోన హరీష్, తాడికొండ సాయితేజ, లంక త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు రాజకీయ భవిష్యత్ కల్పించింది టీడీపీనే: మూల్పూరి బాలకృష్ణారావు

గన్నవరం, ఏప్రిల్ 11: బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ భవిష్యత్‌ను కల్పించింది టీడీపీనే అని, బీసీలకు రాజకీయ పదవుల్లో సముచిత స్థానం కల్పించిందని, మంత్రులను చేసిందని మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణారావు అన్నారు. కేసరపల్లిలో బుధవారం రాత్రి టీడీపీ గ్రామ అధ్యక్షుడు పలగాని బాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మూల్పూరి మాట్లాడారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు పెద్దపీట వేస్తోందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. బీసీలకు గుర్తింపు తెచ్చింది టీడీపీనేనని, కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని టీడీపీ నేత కొనకళ్ల బుల్లయ్య అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా, పార్టీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, మోదుగుమూడి సత్యనారాయణ, జూపల్లి సురేష్, కోటేశ్వరరావు, రామకృష్ణ, చిక్కవరపు నాగమణి, మండవ లక్ష్మీ, ఎంపీఎల్ ప్రసాద్, శొంఠి కిషోర్, పిచ్చేశ్వరరావు, రత్తయ్య, నాగ ప్రసాద్, పలగాని వేణు పాల్గొన్నారు.



ఉయ్యూరు ఈద్గాలో రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

భక్తిశ్రద్ధలతో రంజాన్

ముస్లింలు గురువారం రంజాన్ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఒకరికొకరు ఈద్‌ముబారక్ చెప్పుకొన్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.





జంక్షన్ ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు, ఉయ్యూరులో శుభాకాంక్షలు చెప్పుకొంటున్న బాలురు

పెనమలూరు, ఏప్రిల్ 11: టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి బోడె ప్రసాద్ నియోజకవర్గ ముస్లింలకు ఈద్ ఉల్‌ఫితర్ శుభాకాంక్షలు తెలిపారు. కానూరు, యనమలకుదురు, పోరంకి, తాడిగడప, గంగూరు మసీదుల వద్ద ముస్లింలతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, షేక్ బుజ్జి, కోయ ఆనంద్‌ప్రసాద్, అంగిరేకుల మురళి, దోనేపూడి రవికిరణ్ పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఉయ్యూరులో ఉదయం అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఈద్గాలో నిర్వహించిన ప్రార్థనల్లో ముస్లింలు పాల్గొన్నారు. దయారా మసీదుకు చేరుకుని పెద్దలను స్మరించుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అబుకలాం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, ఉయ్యూరు మాజీ చైర్మన్ ఖుద్దూస్, టీడీపీ నాయకులు రఫీ, అజ్మతుల్లా, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ అనీస్ తదితరులు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

హనుమాన్‌జంక్షన్: ఏలూరు రోడ్డులోని ఈద్గా ఆవరణలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జంక్షన్ మదీనా మసీదు కమిటీ అధ్యక్షుడు షేక్ మౌలాలి ఆధ్వర్యంలో రంజాన్‌ను జరుపుకొన్నారు. మత గురువు షేక్ కుర్ రహమాన్ రంజాన్ పవిత్రను, విశిష్టతను వివరించారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి



గోసాలలో ముస్లిం పెద్దలతో బోడె ప్రసాద్

కంకిపాడు: ముస్లింల అభ్యున్నతి కృషి చేస్తానని టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు మండలం గోసాలలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. జాతీయ రహదారి అభివృద్ధి చేసినప్పుడు మసీదు అభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడి రూ.25 లక్షలు ఇప్పించానని తెలిపారు. అందుబాటులో ఉండే తనకు మద్దతు ఇవ్వాలని ముస్లిం మత పెద్దలను కోరారు. గోసాల గ్రామ కమిటీ అధ్యక్షుడు షేక్ మాబు సుభాని, షంషేర్ అలీ, సయ్యద్ అమీర్, ఎండీ ఆరిఫ్, పఠాన్ మస్తాన్, ఆషీస్ అనాస్, ఎందువ రాంబాబు, కోనేరు సాంబయ్య, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలి

ఉంగుటూరు, ఏప్రిల్ 11: ఉపాధి హామీ పథకంలో పనిచేసే ప్రతి కుటుంబానికి 200 పని దినాలు కల్పించాలని, కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.పవన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉపాధి పని పరిశీలనలో భాగంగా గురువారం ఆయన తేలప్రోలుకు విచ్చేశారు. ఉపాధిహామీ పథకం కూలీలతో ఆయన మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పథకానికి రూ.3లక్షల కోట్ల నిధులు అవసరం ఉందని, కానీ రూ.86వేల కోట్లు కేటాయించడం వెనుక మోదీ ఆంతర్యం ఏమిటో అర్థమవుతుందన్నారు. ఎన్నికల సమయంలో రూ.28 పెంచి, గతంలో ఇస్తున్న పలుగు. పార, మంచినీరు. టెంటు, మజ్జిగ, సమ్మర్ అలవెన్స్ వంటివి తొలగించి, కూలీలకు అందాల్సిన వంద రూపాయలను ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆరోపించారు. పేదల పొట్టకొట్టేందుకు సిద్ధమవుతున్న బీజేపీని, దానికి సహకరిస్తున్న వైసీపీని రానున్న ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. వ్యవసాయకార్మికసంఘం మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి వి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని కళాజాత

గన్నవరం, ఏప్రిల్ 11: టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలంటూ గాంధీబొమ్మ సెంటర్‌లో ఎన్నికల ప్రచార రథంలో ప్రదర్శించిన కళాజాత అందరినీ ఆకట్టుకుంది. గురువారం యార్లగడ్డ వెంకట్రావును గెలిపించాలని కళాకారులు ప్రదర్శనలు చేశారు. టీడీపీకి ఓటెందుకు వేయాలో వివరిస్తూ కళాకారులు గేయాలను ఆలపించారు. నృత్యాలు చేశారు.



గన్నవరంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మానవత సేవా సంస్థ ప్రతినిధులు



ఉయ్యూరులో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు



జంక్షన్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ, దళిత సంఘాల నాయకులు

సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే

ఘనంగా పూలే జయంతి ● చిత్రపటాలకు పలువురి నివాళి

గన్నవరం, ఏప్రిల్ 11: "అక్షర జ్ఞానం అందరికి కావాలని ఆకాంక్షించిన తొలి సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే. భార్య సావిత్రి బాయికి చదువు చెప్పించి ఆమెను తొలి మహిళ ఉపాధ్యాయురాలుగా చేసిన ఘనత ఆయనకే దక్కింది."అని ఆర్యవైశ్య ప్రముఖుడు కుర్మాల సత్య శ్రీనివాసకుమార్ గుప్త అన్నారు. జ్యోతిరావ్ పూలే జయంతి సందర్భంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ఆయన చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. మీసేవ కుమార్, శిరీష దంపతులు పాదచారులకు, బస్సుల్లో ప్రయాణించిన వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేశారు. అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యదర్శి కర్రా వరప్రసాద్, కోశాధికారి కృష్ణారావు, అనురాధ, ప్రసాదరావు, మోటమర్రి శేఖర్, రాధిక, డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉయ్యూరు: ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సత్తార్, గౌరవాధ్యక్షుడు నూకల సాంబశివరావు, సెక్రటరీ పూర్ణచంద్రరావు, బాపిరాజు, డాక్టర్ తిరుమలరావు, భాను ప్రకాశ్, పొగిరి రాము తదితరులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: జ్యోతీరావు పూలే స్ఫూర్తితో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీదని ఆర్‌ఆర్‌డీఎస్ కార్యదర్శి ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెంలో ఆర్‌ఆర్‌ఆర్ డీఎస్ ఆధ్వర్యంలో జ్యోతీరావు పూలే చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపసర్పంచ్ బెజవాడ వెంకటకృష్ణారావు, బీసీ ఫెడరేషన్ నాయకులు కొలుసు గంగాజలం, మందపాటి రాంబాబు, పల్లగాని వీరాంజనేయులు, దేవరకొండ శ్రీనివాసరావు, పాల సొసైటీ అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు, నెరుసు తాతయ్య, బీజేపీ నాయకులు కసుకుర్తి వెంకటశాస్త్రులు, బీసీ యువత పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్: విద్యా వ్యాప్తి, బడుగు బలహీన వర్గాల మహిళల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన జ్యోతిరావు పూలే జీవితం నేటితరానికి ఆదర్శనీయమని మానవత సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు మారు బోయిన కోటేశ్వరరావు అన్నారు. మానవత కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. బీసీ, దళిత సంఘాలు ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట జయంతి వేడుక నిర్వహించారు. మానవత సంస్థ నిర్వాహకులు సుభాచారి, నారాయణరావు, సత్యనారాయణ, ఇందిరాదేవి, రామచంద్రరావు, సూర్యనారాయణ, మట్టా వరసాయిప్రసాద్, బొకినాల సాంబశివరావు, జింకా నలగామరాజు, వీడీఎస్ ప్రసాద్, నిమ్మకూరి కిరణ్ పాల్గొన్నారు.

మహనీయుడు పూలే: బోడె ప్రసాద్

పెనమలూరు: సమాజంలో అంటరానితనం నిర్మూలనకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని టీడీపీ-జనసేన-బీజేపీ నియోజకవర్గ అభ్యర్థి బోడె ప్రసాద్ పేర్కొన్నారు. పోరంకి టీడీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే చిత్ర పటానికి ఆయన నివాళులర్పించారు. ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్ ప్రసాద్, షేక్ బుజ్జి, పీతా గోపీచంద్, జంపన వీరశ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, లుక్కా అరుణ్‌బాబు, సంగెపు రంగారావు, తాడిశెట్టి వీరాస్వామి, అంగిరేకుల మురళి, మాదు రామకృష్ణ, మాదు నాగరాజు, అరేపల్లి దాసు, జటంగి మల్లయ్య, బొంగరాల అబ్రహాం పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించి..

అభివృద్ధికి బాటలు వేయండి: బాలశౌరి



కాటూరులో మాట్లాడుతున్న వల్లభనేని బాలశౌరి

ఉయ్యూరు, ఏప్రిల్ 11: ఎంపీగా మచిలీపట్నం పోర్టు నిర్మాణానికి నిధులు తెచ్చానని, నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని, పోర్టు నిర్మాణం పూర్తయితే యువకులకు ఉద్యోగాలు, ఉపాధి దొరుకు తాయని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మచిలీపట్నం పార్లమెంట్ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. కూటమి అభ్యర్థులకు ఓట్లువేసి గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని ఆయన ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కూటమి పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావుతో కలిసి ఆయన కాటూరులో పర్యటించారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీలు వంటి మౌలిక వసతులు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని ఆయన అన్నారు. చంద్రబాబు ప్రకటించిన ఆరు అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాజేంద్రప్రసాద్ వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి తప్ప అభివృద్ధి లేదని కొనకళ్ల నారాయణ అన్నారు. టీడీపీ నాయకులు యెనిగళ్ల కుటుంబరావు, కాటూరి శరత్‌బాబు, వెంకటనారాయణ, వేమూరి శ్రీనివాసరావు, కాకాని శ్రీనివాసరావు, యుగబాబు, ప్రవీణ్, దండమూడి చౌదరి, హరీశ్, జనసేన నాయకులు ముప్పా రాజా, ఆదినారాయణ, శివప్రసాద్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మూల్పూరి కన్నుమూత



మూల్పూరి సత్యనారాయణ(ఫైల్), భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఏప్రిల్ 11: కేసరపల్లికి చెందిన సీనియర్ రాజకీయ నేత, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మూల్పూరి సత్యనారాయణ(101)మృతి చెందారు. గ్రామంలోని పీఏసీఎస్‌కు 25 ఏళ్ల పాటు ఆయన అధ్యక్షుడిగా పనిచేశారు. అప్పట్లో సీఎంగా ఉన్న కోట్ల విజయభాస్కర్‌రెడ్డి నుంచి ఉత్తమ పీఏసీఎస్ అధ్యక్షుడిగా అవార్డు అందుకున్నారు. 40 ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీలో కీలక నేతగా ఉన్న సత్యనారాయణ కాకాని వెంకటరత్నానికి ప్రియ శిష్యుడిగా ఉండేవారు. ఉయ్యూరు షుగర్ ఫ్యాక్టరీలో జీవితకాల సభ్యులుగా ఉన్నారు. ఆయనకు ఐదుగురు కుమారులు. సత్యనారాయణ భౌతికకాయానికి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే ముసునూరు రత్నబోస్, సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక, వైస్ ఎంపీపీ సాతులూరి శివనాగరాజకుమారి, ఎంపీటీసీ సభ్యుడు శొంఠి కిషోర్, ఏలూరు కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ జాస్తి విజయభూషణ్‌కుమార్, గూడపాటి తులసీమోహన్ నివాళులర్పించారు.

పారిశ్రామిక ప్రగతి చంద్రబాబుతోనే సాధ్యం



మానికొండలో ఎన్నికల ప్రచారం చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్

ఉంగుటూరు, ఏప్రిల్ 11: పారిశ్రామిక ప్రగతి, యువతకు ఉద్యోగాలు, ఉపాధి, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ఆయనను ముఖ్యమంత్రిని చేసుకుందామని టీడీపీ- జనసేన-బీజేపీ గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్ అన్నారు. ప్రజాగళం పేరుతో తన సతీమణి లక్ష్మితో కలిసి మానికొండలో నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం గురువారం రెండోరోజూ ఉత్సాహంగా సాగింది. మూడుపార్టీల నాయకులు, కార్యకర్తలు, తెలుగు మహిళలతో కలిసి ఇంటింటికీ వెళ్లిన సతీష్ సూపర్‌సిక్స్ పథకాలతో ప్రతి కుటుంబానికి కలిగే లబ్ధిని ఆయన ప్రజలకు వివరించారు. గ్రామంలో అర్హులకు ఇళ్ల స్థలాలు దక్కలేదని పలువురు మహిళలు సతీష్ దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి, అర్హులైన పేదలందరికి ఇళ్లస్థలాలు పంపిణీ చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు. నేతలు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, మండవ రమ్య యడ్లపల్లి సాయి, బెజవాడ నాగేశ్వరరావు, ఆరికట్ల రవికుమార్, రాజ్ కుమార్, లాబాను, దాదా, వరికూటి కిషోర్, భువనేష్, రవి చంద్, నూతక్కి బెనర్జీ, ప్రకాష్, తాతినేని పార్వతి, రసూల్, రూసీ పాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీ ముమ్మర ప్రచారం

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరఫున పోటీచేస్తున్న యార్లగడ్డ వెంకట్రావును గన్నవరం ఎమ్మెల్యేగా, మచిలీపట్నం వల్లభనేని బాలశౌరిని ఎంపీగా గెలిపించాలని కోరుతూ మండలంలోని గ్రామాల్లో టీడీపీ గ్రామ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. తేలప్రోలు, పొట్టిపాడు, వేంపాడు, మానికొండ, ఆత్కూరు. పెదఅవుటపల్లి, తరిగొప్పల గ్రామాల్లో నాయకులు ఇంటింటికీ తిరుగుతూ కూటమి అధికారంలోకి వచ్చాక అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించి, అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరుతున్నారు.

ఆర్భాటంగా తాడిగడపను మునిసిపాలిటీ చేశారు

జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం: బోడె హేమ



యనమలకుదురులో ఇంటింటి ప్రచారం చేస్తున్న బోడె హేమ, వైష్ణవి

పెనమలూరు, ఏప్రిల్ 11: తాడిగడప మునిసిపాలిటీని ఆర్భాటంగా ఏర్పాటు చేసి దాని అభివృద్ధికి జగన్‌రెడ్డి ప్రభుత్వం చేసింది శూన్యమని బోడె ప్రసాద్ సతీమణి హేమ, కుమార్తె వైష్ణవి పేర్కొన్నారు. గురువారం యనమలకుదురు 14వ డివిజన్‌లో నిర్వహించిన శంఖారావం పాదయాత్రలో వారు పాల్గొన్నారు. స్థానికులతో మాట్లాడారు. తాడిగడప మునిసిపాలిటీలోని నాలుగు క్లస్టర్లలో ఇప్పటికీ తొంభై శాతం మౌలిక సదుపాయాలు కల్పించలేదని ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. యనమలకుదురులో మంచినీళ్ల, రోడ్లు, డ్రెయిన్లు లేక ప్రజలు దోమలతో అల్లాడిపోతున్నారని పేర్కొన్నారు. కూటమి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును గెలిపించాలని ప్రజలను కోరారు. నేతలు అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, మల్లంపాటి విజయలక్ష్మి, సంపర శేఖర్, బెజవాడ వెంకటేష్, కందుల శివరాం, వెలగపూడి రాజశేఖర్, వెలగపూడి రవి పాల్గొన్నారు.

జోగికి ఓటమి భయం

● అందుకే మైలవరానికి తిరుగు పయనమయ్యారు: బోడె వెంకట్రామ్

కంకిపాడు, ఏప్రిల్ 11: వైసీపీ పెనమలూరు అభ్యర్థి జోగి రమేశ్‌కు ఓటమి భయం పట్టుకుందని, దీంతో ఆయన మైలవరం తిరుగుపయనమయ్యేందుకు సిద్ధమయ్యారని టీడీపీ-జనసేన-బీజేపీ పెనమలూరు అభ్యర్థి బోడె ప్రసాద్ కుమారుడు బోడె వెంకట్రామ్ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరులో గురువారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బోడె ప్రసాద్‌పై గెలవడం సాధ్యం కాదని జోగి రమేశ్‌కు అర్థమై ఓటమి భయంతో మైలవరం తిరుగుపయమవుతున్నారంటూ సోషల్ మీడియాలోనూ విస్తృత ప్రచారం జరుగుతోందన్నారు. వైసీపీని ప్రజలు ఛీకొడుతున్నారన్నారు. పావన మూర్తి, వై.ఫణి, ఈ కోటేశ్వరరావు, టి. సతీష్, ఈ స్టాలిన్, ఇ.శ్రీనివాసరావు, అడపా మహేష్, సీహెచ్ రవి రాజ, వి.రఘు, సీహెచ్ అభి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





జనసేన పార్టీలోకి బేబమ్మ

పెడన రూరల్ : చెన్నూరు ఉపసర్పంచ్ యర్రంశెట్టి వీర కస్తూర్బాయి (బేబమ్మ) వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరారు. బేబమ్మ భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు సోదరి. మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, బండి రామకృష్ణ సమక్షంలో చెన్నూరు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు 100 మంది జనసేన పార్టీలో చేరారు.



వాలంకలో సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్న కాగిత కృష్ణప్రసాద్, వల్లభనేని అనుదీప్



దేవరపల్లిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కుమార్ రాజా



ఉల్లింగిపాలెంలో కొల్లి నీలిమ ప్రచారం



అప్పికట్లలో వర్ల విశ్రమ ప్రచారం

జగన్ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం

కృత్తివెన్ను, ఏప్రిల్ 11 : జగన్ పాలనలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని పెడన నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ విమర్శించారు. వాలంక, పీత లావ గ్రామాల్లో పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలసౌరి తనయుడు అనుదీప్‌తో కలిసి కాగిత కృష్ణప్రసాద్ ఇంటింటికి తిరుగుతూ, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అంతకు ముందు కృష్ణప్రసాద్ సతీమణి కాగిత శిరీష కృత్తివెన్నులో ప్రచారం నిర్వహించారు. కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, తీరప్రాంత రైతులకు రెండు పంటలకు నీరిస్తామని జగన్ నమ్మించి, కనీసం ఒక పంటకు కూడ నీరు ఇవ్వలేదన్నారు. ఆక్వా రైతులకు నీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆచితూచి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

ఉల్లింగిపాలెంలో నీలిమ ప్రచారం

మచిలీపట్నం టౌన్ : బడుగు బలహీన వర్గాల అభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సతీమణి కొల్లు నీలిమ అన్నారు. ఉల్లింగిపాలెంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా కొల్లు నీలిమ పర్యటించారు. ఇంటింటికీ తిరిగి చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు చింతా చిన్ని, జనసేన నాయకులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి : కుమార్‌రాజా

తోట్లవల్లూరు : ఒక్క అవకాశం కల్పిస్తే ప్రజలకు అనితర సేవలందిస్తానని పామర్రు టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా అన్నారు. దేవరపల్లిలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్ బటన్ నొక్కుడు ద్వారా రూ.10 ఇచ్చి రూ 100 దోచేస్తున్నాడని విమర్శించారు. వీరపనేని శివరామ్‌ప్రసాద్, కొల్లి శ్రీనివాసరెడ్డి, వెంకట అప్పారావు, లుక్కా రేణుకారావు, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి గోపాలకృష్ణ, నాగేశ్వరరావు నాయక్, వీరంకి పరశురామ్, శీలం ప్రకాశరావు, మృతబాబు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం

పెదపారుపూడి : బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా అన్నారు. ఎలమర్రులో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. టీడీపీలో బీసీలకు ఉన్నత స్థానం ఉందన్నారు. రాష్ట్ర బీసీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, చలసాని రమేష్ చౌదరి, మసిముక్కు రాంబాబు, సూరపనేని సత్యనారాయణ, తుపాకుల అప్పారావు, వీరంకి పరశురాం, శివ శంకర్, వెంకట నారాయణ పాల్గొన్నారు.

అప్పికట్లలో వర్ల విశ్రమ ప్రచారం

పెదపారుపూడి : కూటమి అభ్యర్థి వర్ల కుమార్ రాజా సతీమణి వర్ల విశ్రమ అప్పికట్ల గ్రామంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, సూరపనేని వెంకట సత్యనారాయణ, తెలుగు మహిళలు చలసాని దివ్య, యార్లగడ్డ లక్ష్మీ, నత్త వాణి ప్రతి గడపకు వెళ్లి పామర్రు అభ్యర్థిగా వర్ల కుమార్ రాజాను, ఎంపీ అభ్యర్థి బాలశౌరికి ఓటు వేసి గెలిపించాలని కోరారు.



టీడీపీతోనే నాయిబ్రాహ్మణుల సంక్షేమం

తోట్లవల్లూరు : పామర్రు టీడీపీఅభ్యర్థి వర్ల కుమార్ రాజా, మచిలీపట్నం జనసేన ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరీకి మద్దతుగా నాయి బ్రాహ్మణ సాధికార కమిటీ మండలంలో పర్యటించింది. నాయి బ్రాహ్మణ సంఘం నేతలు దాలిపర్తి ప్రసాద్, ఆముదాలపల్లి గోపాలకృష్ణ, అయోధ్య హరిబాబు, ఇంటూరి మాణిక్యాలరావు, జిడుగు శ్రీనివాసరావు, భట్టిప్రోలు శ్రీరంగం తదితర నాయకులు వల్లూరుపాలెం, తోట్లవల్లూరు తదితర గ్రామాల్లో పర్యటించి బీసీల కోసం చంద్రబాబు ప్రకటించిన జయహో బీసీ డిక్లరేషన్ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ ప్రభుత్వంతోనే నాయీ బ్రాహ్మణులకు మేలు జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో పర్యటించి నాయి బ్రాహ్మణుల మద్దతు కోరారు. వల్లూరుపాలెంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వర్ల చాణిక్య ప్రచారం

మామిళ్లపల్లి (పమిడిముక్కల) : మామిళ్లపల్లి, అగినపర్రు గ్రామాల్లో పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్లకుమార్ రాజా సోదరుడు వర్ల చాణిక్య ప్రచారం చేశాడు. వైసీపీ పాలనలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక పొరుగు రాష్ట్రాలకు వలసవెళుతున్న దుర్భర పరిస్థితి ఏర్పడిందని విమర్శించాడు. మండల పార్టీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, కొల్లూరి బాబ్జి, జక్కా శ్రీనివాసరావు, గోవాడ నాందేశ్వరరావు, పల్లె సురేంద్ర, చిగురుపాటి కృష్ణా రావు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బుద్ధప్రసాద్‌కు బీసీ నేతల మద్దతు

అవనిగడ్డ : నియోజకవర్గ బీసీ సంఘం ఉపాధ్యక్షులు వీరంకి నరేంద్ర, సంఘ సభ్యులతో కలిసి బుద్ధప్రసాద్‌కు మద్దతు తెలిపారు. బుద్ధప్రసాద్ ఇంటి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో వీరంకి నరేంద్ర మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేలా పని చేస్తామని తెలిపారు. బాదర్ల నాగ నవీన్, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, జనసేన నేతలు మర్రే గంగయ్య, గుడివాక శేషుబాబు, నందగోపాల్, టీడీపీ నేతలు బండే శ్రీనివాసరావు, నడకుదుటి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ నాయకుడు జనసేనలో చేరిక

కోడూరు : వి.కొత్తపాలెం వైసీపీ నాయకుడు రేపల్లె పిచ్చేశ్వరరావు మండలి బుద్ధప్రసాద్ సమక్షంలో గురువారం జనసేన పార్టీలోకి చేరారు. పార్టీ కండువా కప్పి మండలి బుద్ధప్రసాద్ సాదరంగా ఆహ్వానించారు.

జనసేన గెలుపే ధ్యేయం

నాగాయలంక : మండలంలో మెజారిటీ ఓట్లు సాధిస్తామని జనసేన పార్టీ నాయకులు మండలి బుద్ధప్రసాద్‌కు హామీ ఇచ్చారు. మండలి రాజేష్ ఆధ్వర్యంలో బుద్ధప్రసాద్‌ను వారు కలిశారు. బొడ్డు విజయ్, కొక్కిలిగడ్డ లంకేశ్వరరావు, మత్తి రాజా, బండ్రెడ్డి హరి, రేమాల మురళీ, బండ్రెడ్డి మల్లిఖార్జున్, బోనం పాపారావు, వడ్లమూడి రామకృష్ణ, ముమ్మారెడ్డి సురేష్, లేబాక అంకాలు పాల్గొన్నారు.



జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో వల్లభనేని బాలశౌరి, రవీంద్ర



ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న కృష్ణప్రసాద్



రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న వెనిగండ్ల



రంజాన్ వేడుకల్లో పాల్గొన్న బుద్ధప్రసాద్

భక్తిశ్రద్ధలతో రంజాన్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 : అల్లా బోధించిన ప్రేమ , త్యాగాలను ప్రతి ఒక్కరూ అలవరచు కోవాలని గవర్నమెంట్ ఖాజీ హాజీ అన్నారు. రంజాన్ వేడుకల్లో భాగంగా గురువారం ముస్తాఖాన్‌పేట ఈద్గా వద్ద ముస్లింలు సామూహిక పార్థనల్లో పాల్గొన్నారు. మచిలీపట్నం పార్లమెంటు ఉమ్మడి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అసెంబ్లీ నియోజక వర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర శుభాకాంక్షలు తెలిపారు. బాలశౌరి, కొల్లు రవీంద్ర , బండి రామకృష్ణ, కొనకళ నారాయణ జామియా మసీదుతో పాటు పలు మసీదులను సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. రాజుపేట మదీనా మసీదులో మత పెద్ద మౌలానా సమీ ఉల్లా దివ్య సందేశమిచ్చారు. **పెడన** : గుడివాడ రోడ్డులోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నియోజకవర్గ కూటమి అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్, బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, వైసీపీ ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము ఈద్గాల వద్దకు వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. **గుడివాడ** : మియాఖాన్ మసీదు, గుల్జార్ చౌక్ మసీదు, షాహీ మసీదు, గుంటూరు మహల్లా, నైజాం పేట, ముబారక్ సెంటర్, కార్మిక నగర్, పాత మల్లాయిపాలెంలోని మస్జిద్-ఎ-మహమ్మదీయ, షాహీ మక్కా మసీదు, కొత్త మల్లాయపాలెం, ఆటోనగర్ మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వర రావుశుభాకాంక్షలు తెలిపారు. **అవనిగడ్డ** : మండలి బుద్ధప్రసాద్ ముస్లింలను కలసి శుభాకాంక్షలు తెలిపారు. యాసం చిట్టిబాబు, గుడివాక శేషుబాబు పాల్గొన్నారు. **కూచిపూడి** : కూచిపూడి, భట్లపెనుమర్రు, మొవ్వ, కోసూరు తురక పాలెం, కాజ, నిడుమోలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కూచిపూడిలో ర్యాలీ నిర్వహించారు. **ఘంటసాల** : ఘోటకం -ఏ కాలనీ జామియా మసీదు, చిన్న మసీదు, లంకపల్లి మసీదులో ప్రార్థనలు చేశారు. అబ్దుల్ గఫార్ రంజాన్ పండుగ విశిష్టతను తెలియజేశారు. **పామర్రు** : ఈద్గా వద్ద ముస్లింలు సాముహిక ప్రార్థనలు జరిపారు. టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా ప్రార్థనల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. **నాగాయలంక** : జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్ద షేక్ సత్తార్ రంజాన్ విశిష్టతను వివరించారు. **చల్లపల్లి** : ఈద్గాలో మైదానంలో ఖురాన్ గురువు సమక్షంలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం నేత, జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్ మజ్జిగ పంపిణీ చేశారు. **తోట్లవల్లూరు** : అంజుమన్ బిల్డింగ్‌పై మత గురువు హసన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యువకులు ర్యాలీ చేశారు. **బంటుమిల్లి** : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బంటుమిల్లి ఈద్గాలో మత గురువులు ముఫ్తీ మహ్మద్ ముసాఫర్ హస్సేన్, అబ్దుల్ అజీమ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. అమీర్, అక్బర్, కమిటీ పెద్దలైన ఎండి కమల్, నజీర్, బాబ్జీ, అలీమ్, అక్బర్, బాబు, ఆదిల్ పాల్గొన్నారు.



మొవ్వలో ముస్లింల ర్యాలీ



బంటుమిల్లిలో ప్రత్యేక ప్రార్థనలు

రాధా-రంగా మిత్ర మండలి అధ్యక్షురాలిగా లంకిశెట్టి నీరజ



మచిలీపట్నం టౌన్ : రాధారంగా మిత్ర మండలి జిల్లా అధ్యక్షురాలిగా లంకిశెట్టి నీరజ నియమితులయ్యారు. కూనప రెడ్డి చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో జరిగిన సమావేశంలో లంకిశెట్టి నీరజకు రాధా రంగా మిత్ర మండలి రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ ధర్మారావు, సీనియర్ న్యాయవాది సోడిశెట్టి బాలాజీ నియామకపత్రం అందజేశారు. ఉపాధ్యక్షురాలిగా బడుగు ఉమాదేవి, మోపిదేవి గోవర్ధనమ్మలకు నియామక పత్రాలు అందించారు. ప్రధాన కార్యదర్శిగా మానేపల్లి ఉషారాణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ముక్కు రంగామణి, సహాయ కార్యదర్శులుగా దొండపాటి లక్ష్మీకుమారి, శ్రీవాణి, వేముల కుమారి, పి. రాధా, కొక్కు ప్రభావతి, కోశాధికారిగా వేమూరి శ్రీదేవిలకు నియామక పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో రంగా, పవన్‌కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థికి రూ.45 వేల ఆర్థిక సాయం



తోట్లవల్లూరు, ఏప్రిల్ 11 : గరికపర్రులో బొమ్మారెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ఇంజనీరింగ్ విద్యార్థి గోళ్ల శివకు రెండో ఏడాది కళాశాల ఫీజు నిమిత్తం బీవీఆర్ యూత్ సభ్యులు గురువారం రూ.45 వేలు సాయం అందించారు. శ్యామ్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు పోటీలు



పెడన రూరల్ : చిన్నారుల్లో ఉత్తేజం పెంపొందించేందుకు ఆటలు, పాటల పోటీల దోహదపడతాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.కల్పవల్లి అన్నారు. చెన్నూరు పరిధిలోని ఆరు అంగన్‌వాడీల వార్షికోత్సవం నిర్వహించారు. చిన్నారులకు వివిధ రకాల ఆటలు, పాటలు, డ్యాన్స్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పార్వతి, గీత, కుమారి, సుజాత, విజయలక్ష్మి పాల్గొన్నారు.



గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

కృత్తివెన్ను, ఏప్రిల్ 11 : ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ గురువారం పలు గ్రామాల్లో కేంద్రబలగాలు కవాతు నిర్వహించాయి. ఎటువంటి అల్లర్లు, గొడవలు లేకుండ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని విధాలుగా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజలంత తమకు సహకరించాలని ఎస్సై నాగరాజు కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా పూజలు

ఘంటసాల : లంకపల్లి గ్రామంలో లక్ష్మీనరసింహస్వామి, అమృత లింగం, సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరాముల నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం గోపూజ, మంటప పూజ, మూల మంత్రానుష్టానాలు, మంటప హోమాలు, ధాన్యాధివాసం, శయ్యాధివాసం, పుష్పధివాసం, నీరాజన మంత్రపుష్పం జరిగాయి. శుక్రవారం ఉదయం 7.36 నిముషాలకు విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం జరుగుతుందని గ్రామస్థులు తెలిపారు.

శ్రీరాముడు అందరికీ ఆదర్శం

మచిలీపట్నం టౌన్ : శ్రీరామచంద్రుని ఏకపత్నీవ్రతం, సోదరప్రేమ అందరికీ ఆదర్శమని టీటీడీ ధర్మాచారిణి జొన్నలగడ్డ మాధవి అన్నారు. పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో కోనేరుసెంటర్‌లో వసంత నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం రాత్రి జొన్నలగడ్డ మాధవి రాముడు సుగుణాభిరాముడు అనే అంశంపై ప్రసంగించారు. వసంత నరావత్రి ఉత్సవాల సందర్భంగా చిలకలపూడి కోదండ రామాలయంలో జోశ్యుల వేణుమాధవప్రసాద్ రాముడు ధర్మస్వరూపుడు అనే అంశంపై ప్రసంగించారు.





పూలేకు ఘననివాళి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 11 : బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి మహాత్మా జ్యోతీరావు పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని పార్లమెంటు నియోజకవర్గ కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. జయంతిని పురస్కరించుకుని మాచవరంలో జ్యోతీరావు పూలే విగ్రహానికి బాలశౌరి, మచిలీపట్నం అసెంబ్లీ టీడీపీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తదితరులు నివాళులర్పించారు. జ్యోతీరావు పూలే విగ్రహానికి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె.వి.వి. సత్యనారాయణ, ఎం. దేవకి, ఆదిలక్ష్మి, పరసా సురేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీసీ సంక్షేమ సంఘ కార్యాలయంలో శేకుబోయిన సుబ్రహ్మణ్యం నివాళులర్పించారు. **గుడివాడ** : టీడీపీ (ప్రజావేదిక)లో పూలే చిత్రపటానికి టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యేలు రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ తదితరులు నివాళ్ళులర్పించారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముగ్గు బజారులో పూలే దంపతుల విగ్రహాలకు మాజీ మంత్రి కొడాలి నాని పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. నియోజకవర్గ అధ్యక్షులు దారం నరసింహారావు, రావులకొల్లు మల్లేశ్వరరావు, యామినిదేవి, శేషుబాబు, ఉమా తదితరులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరరావు, విశ్రాంత ఫోర్‌మెన్ ఉప్పల సాం బశివరావు, విశ్రాంత ఏఈ అంబటి బసవ శంకరరావు, కొండేటి భాస్కరరావు, మోహనరావు ఆదిశేషు, వెంకటేశ్వరరావు, ఇసాక్, హర్ష తదితరులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **అవనిగడ్డ** : మాలమహానాడు కార్యాలయంలో ఘనంగా జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్ అధ్యక్షతన మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలవేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ దిడ్ల ప్రసాద్, ఎస్‌డబ్ల్యుఓ పుట్టి కృష్ణ, బీసీ నేతలు లుక్కా పిచ్చియ్య, నారేపాలెం శంకరరావు, గంగాధర్, ఎస్సీ నేతలు బడుగు ప్రేమ్, చీకుర్ల నవీన్, సచిన్, అనిల్, కమలాకర్, శ్రీనివాసరావు, కర్రి సుధీర్ పాల్గొన్నారు. **పామర్రు** : టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి వర్లకుమార్‌రాజా తదితరులు నివాళులర్పించారు. **నాగాయలంక** : మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్ను రంగారావు తదితరులు పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. శ్రీనివాస ప్రసాద్, దాసి జీవరత్నం, గుంటూరు సురేష్, దాసరి రాజశేఖర్, అంద్రాజు ఆదినారాయణ, తానంకి చంటి పాల్గొన్నారు. **ఘంటసాల** : జ్యోతిరావు పూలే విగ్రహానికి బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు అందె జగదీష్ పూలమాల వేసి నివాళులర్పించారు. వుడతా చిత్తరంజన్ సాయి, గుత్తికొండ సత్యనారాయణ, నందం వెంకటేశ్వరరావు, మాచర్ల మస్తాన్ రావు, పోలన వీరభద్రరావు, బందారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి** : మోపిదేవి గురుకుల పాఠశాలలో పూలేకు ప్రిన్సిపాల్ కె.వీరరవి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.